## క్లుప్తంగా

### సీఐలకు ఆత్మీయ వీడ్కోలు



సీఐలను సన్మానిస్తున్న దృశ్యం

**కదిరి:** బదిలీపై వెళ్లిన కదిరి పట్టణ సీఐ తమ్మిశెటి మధు , రూరల్ సీఐ శివశంకర నాయక్‌కు పట్టణ ప్రజలు ఆత్మీయ వీడ్కోలు పలికారు. స్థానిక దత్త గార్డెన్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సభకు పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరై సీఐల సేవలను కొనియాడారు. అనంతరం వారిని పూలమాలలు, దుశ్శాలువాలు, బొకేలతో ముంచెత్తారు. సీఐలు మాట్లాడుతూ కదిరి ప్రాంత ప్రజల ఆత్మీ అభిమానానికి రుణపడి ఉంటామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, వైఎస్సార్‌టీఎస్ నాయకులు, కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

**పుట్టపర్తి టౌన్:** నూతనంగా బాధ్యతలు తీసుకొన్న పెనుకొండ సీఐ రాజారమేష్ మంగళవారం ఎస్పీ కార్యాలయంలో తన చాంబర్‌లో ఎస్పీ మాధవరెడ్డిని కలిశారు. శాంతి భద్రతలు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు.

### స్థల ఆక్రమణపై ఫిర్యాదు

**నల్లచెరువు:** తలమర్లవాండ్లపల్లి పంచాయతీ పరిధిలోని యర్రగుంటపల్లి జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్–958లో ఆరు సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కల్లిపల్లికి చెందిన కొందరు వ్యక్తులు జేసీబీలతో చదును చేసి ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగభూషణ, డైరెక్టర్ ఆదిమూర్తి, గ్రామస్తులు మల్లప్ప, రెడ్డెప్ప తదితరులు వాపోయారు. అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని వారు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

### రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు 'ఆదర్శ' విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో పీడీ మాధవరాజులు

**కనగానపల్లి:** రాష్ట్ర స్థాయిలో జరిగే స్కూల్ గేమ్స్ పోటీలకు కనగానపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికై నట్లు పీడీ మాధవరాజులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత నెల 27,28,29 తేదీల్లో జరిగిన జిల్లా స్థాయి పోటీలో విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఎంపికైన వారిలో అండర్– 19 విభాగం నందు ఖోఖోలో మహేశ్వరి, మహితా, మానసా, కబడీలో వైష్ణవి, బేస్‌బాల్ పోటీలకు తజ్వీనా ఉన్నారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ప్రిన్సిపాల్ రవికిరణ్ అభినందించారు.

### మహిళలకు వ్యాపార నైపుణ్యాలు పెంపొందిస్తాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

**ధర్మవరం:** మహిళలకు వ్యాపార నైపుణ్యాలను పెంపొందించి ఆర్థిక సాధికారతను సాధించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం ఆర్పీలు, పట్టణ మహిళా డ్వాక్రా సంఘాల లీడర్లకు జగనన్న మహిళా మార్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ కాయగూరల మార్కెట్ సమీపంలోనున్న మీసేవ కేంద్రం కింది భాగాన జగనన్న మహిళా మార్ట్ ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నామన్నారు. మార్ట్‌తో నాణ్యమైన సరుకులు తక్కువ ధరకే లభిస్తాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు మార్ట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. 1300 సంఘాలు మార్కెట్ వాటాదారులుగా ఉంటారని తెలిపారు. సీసీ సుధాకర్, సిటీ మిషన్ మేనేజర్ వెంకటేషులు, వైఎస్సార్‌సీపీ నేత చాంద్‌బాషా పాల్గొన్నారు.

# పేదలందరికీ నాణ్యమైన వైద్యం

• ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

**గాండ్లపెంట:** గ్రామీణ ప్రాంతాల్లోని పేదవారికి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి అన్నారు. మండలంలోని గొడ్డువెలగల గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వైద్య శిబిరానికి వచ్చిన వైద్య నిపుణులు రమణయ్య, స్మితను ఎమ్మెల్యే అభినందించారు. శిబిరంలో 266 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి 26 మందిని ఉన్నత చికిత్స కోసం రెఫర్ చేసినట్లు డాక్టర్ మహేశ్వరమారుతి, డాక్టర్ బాబాఫక్రుద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీపీ తాతం జగన్మోహన్, కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**ఎన్‌పీకుంట:** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం మరికొమ్మదిన్నె పంచాయితీలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో 206 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారిణి డాక్టర్ షేక్ ఆసియా తెలిపారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్ హాజరై వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ఆనంద్‌వర్ధన్, ఎంపీడీఓ ఆదినారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**తలుపుల:** మంగివాండ్లపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మంగళవారం తహసీల్దార్ శ్రీధర్, స్పెషలాఫీసర్ మల్లికార్జునరెడ్డి, వైద్యాధికారులు మున్వర్‌బాషా, సల్మా ఆధ్వర్యంలో 243 మందికి వైద్య సేవలందించారు. బత్తలపల్లి ఆర్డీటీ నుంచి ఇద్దరు, బెంగుళూరు శంకర్ ఆసుపత్రి నుంచి ఒక్కరు స్పెషలిస్ట్ డాక్టర్లు వచ్చి వైద్యసేవలు అందించారు.

**అమడగూరు (ఓడీ చెరువు):** ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో అన్ని రకాల జబ్బులకూ ఉచితంగా వైద్యం అందిస్తున్నారని ఓడీ చెరువు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజునాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఓడీచెరువు పట్టణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులు, కంటి పరీక్షలు, జనరల్ పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వీన్‌భాను, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షామీర్‌బాషా, టౌన్ కన్వీనర్ క్రిష్టారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద్‌రెడ్డి, సర్పంచ్ గోవిందు, తదితరులు పాల్గొన్నారు.



'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

**అమడగూరు:** డబ్బులు లేని పేదలకు కూడా ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందింపజేయాలనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం చీకిరేవులపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. టోకెన్లు తీసుకున్న వారికి ఉచితంగా వైద్య సేవలు అందించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరెడ్డి, ఎంపీడీఓ మునెప్ప, వైద్యాధికారులు మోనా, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

**జగనన్న సురక్ష పేదలకు వరం**

**చెన్నేకొత్తపల్లి:** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పేదలకు వరమని ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవిందరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మండల కేంద్రంలోని జగన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 500 మంది ఆరోగ్య సిబ్బంది వైద్య సేవలు అందజేశారు. డాక్టర్ ఉదయ్, సీడీపీఓ కవితాదేవి, ఈఓఆర్డీ అశోక్‌నాయక్, వైస్ ఎంపీపీ రాములమ్మ, సర్పంచ్, ధనశ్రీ, సింగిల్ విండో అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బత్తలపల్లి:** పోట్లమర్రి గ్రామ సచివాలయంలో మంగళవారం సర్పంచు అక్కిం దామోదర్ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు గంగిరెడ్డి, రామకృష్ణ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింఇగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప పాల్గొన్నారు.

**తాడిమర్రి:** చిల్లవారిపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు కృష్ణప్రసాద్, జ్యోతిర్మయి 230 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మండల ప్రత్యేక అధికారి రామాంజినేయులు, సర్పంచ్ పెద్ద శివారెడ్డి, డీటీ భాస్కర్‌రెడ్డి, కామాక్షి, ఏపీఓ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్యం**

**కనగానపల్లి:** పేదలందరికీ మెరుగైన వైద్యం అందించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ తెలిపారు. ముక్తాపురంలో జగనన్న సురక్ష శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్య సేవలు అందించారు. ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ డాక్టర్లు చెన్నారెడ్డి, భానురేఖ, ఈఓఆర్డీ అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కన్వీనర్ అమరనాథరెడ్డి, నాగముని, సర్పంచులు నారాయణ, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నల్లమాడ:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' క్యాంప్‌కు ప్రజల నుంచి స్పందన లభించింది. నల్లమాడ పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి క్యాంప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 314 మంది వివిధ రకాల వైద్య సేవలను వినియోగించుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, మండల ప్రత్యేకాధికారి, డీఈఓ మీనాక్షి, ఎంపీడీఓ కొండన్న, తహసీల్దార్ దేవేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ధర్మవరం రూరల్:** పోతుకుంట గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 314 మందికి ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. దాదాపు 80 మందికి కంటి వైద్య పరీక్షలను చేసి 40 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. సర్పంచ్ నాగవేణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామయ్య, డాక్టర్లు పుష్పలత, దిలీప్‌కుమార్, స్పెషలిస్టు డాక్టర్లు వినోద్, సుదీప్తి, జిల్లా క్షయ నివారణ అధికారి తిప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సాల్మన్, ఎంపీడీఓ సౌజన్యకుమారి, సీహెచ్‌ఓ కళావతి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు జగనన్న సురక్ష పత్రాన్ని అందిస్తున్న నాయకులు



జగనన్న సురక్ష క్యాంపులో మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

**రామగిరి:** ప్రజలను ఆరోగ్యం ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని నసనకోట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ వెంకటరెడ్డి, సర్పంచ్ మీనుగ నాగరాజు, రాష్ట్ర బ్యూటీషియన్ డైరెక్టర్ సరళ, ఈఓఆర్డీ రాధాకృష్ణ, రామలింగారెడ్డి, జేష్వరామయ్య, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పుట్టపర్తి టౌన్:** ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో చేపట్టిన ఇంటి వద్దకే మెరుగైన వైద్యం కార్యక్రమం అద్భుతమని మండల ప్రతేక అధికారి, జిల్లా భూగర్భజలశాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రూప, జిల్లా అగ్రీ అడ్వైజరీ బోర్డు కమిటీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, తహసీల్దార్ కరుణాకర్, మండల సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

### 7లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలి

**ఎన్‌పీకుంట:** ఈ క్రాప్ నమోదు చేసుకున్న ప్రతి రైతూ ఈ నెల 7లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏడీఏ సత్యనారాయణ సూచించారు. ఈ-క్రాప్ సూపర్‌చెక్‌లో భాగంగా ధనియానిచెరువులో నమోదు చేసిన పంటల వివరాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఈ-క్రాప్ నమోదు, ఈ-కేవైసీతో కలిగే లాభాలను రైతులకు వివరించారు. ఏఓ లోకేశ్వరరెడ్డి, వీఏఏ నరసింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### ఆలయానికి విరాళం



రూ. 2 లక్షల నగదు అందజేస్తున్న దృశ్యం

**కదిరి అర్బన్:** తలుపుల మండలం బట్రేపల్లిలో చౌడేశ్వరి ఆలయ పునఃనిర్మాణానికి మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డా. బత్తల హరిప్రసాద్ రూ. 2 లక్షల విరాళాన్ని అందించారు. ఈ మొత్తాన్ని కుమ్మరవాండ్లపల్లిలోని ఆయన స్వగృహంలో గ్రామస్తులకు అందజేశారు.

### చోరీ యత్నం విఫలం

**ధర్మవరం అర్బన్:** పట్టణంలోని సత్యసాయినగర్‌లో సోమవారం అర్ధరాత్రి ఓ న్యాయవాది ఇంట్లో చోరీకి ఓ దొంగ విఫలయత్నం చేశాడు. వివరాలు.. న్యాయవాది అబ్దుల్లా కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లాడు. సోమవారంరాత్రి స్కూటీలో వచ్చిన దొంగ ఇంటి తలుపు తాళం పగలకొట్టేందుకు ప్రయత్నించాడు. చివరకు పైన ఉన్న సీసీ కెమెరాను గమనించి వెంటనే దొంగ పారిపోయాడు. ఉదయం ఇంటికి వచ్చిన న్యాయవాది దొంగ తలుపులు పగులకొట్టే దృశ్యం కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### ఉత్తమ సేవలతోనే గుర్తింపు

**బత్తలపల్లి:** ప్రజలకు ఉత్తమ సేవలు అందించడం ద్వారానే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ బగ్గిరి త్రివేణి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ రెగ్యులర్ ఎంపీడీఓగా ధర్మవరం వెళ్తున్న సౌజన్యకుమారి, ఈఓఆర్డీగా పదోన్నతి పొందిన బత్తలపల్లి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరయ్యను ఘనంగా సన్మానించారు.

# శివారు కాలనీల అభివృద్ధికి చర్యలు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

• ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

**ధర్మవరం:** మున్సిపాలిటి పరిధిలోని శివారు కాలనీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక 2వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మవరం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తమ ప్రభుత్వం 13,500 మందికి పైగా ఇంటిస్థలాలు ఇవ్వడంతో పాటు గృహాలు నిర్మించి ఇస్తోందన్నారు.1.50 సెంట్ల స్థలం కేటాయించి చేనేత కార్మికులు ఇంటి నిర్మాణంతో పాటు మగ్గం షెడ్ నిర్మించేందుకు చర్యలు చేపట్టామన్నారు. పేద వారు సొంతిళ్లు కట్టుకోలేక పోతే ప్రభుత్వం కట్టించేలా కుణుతూరు లేఅవుట్‌లో పనులు ప్రారంభించామన్నారు. ఎన్నికలకు ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను భగవద్గీతగా భావించి వంద శాతం హామీలను అమలు చేసి దేశంలోనే విశ్వసనీయత కల్గిన సీఎంగా పేరు పొందారన్నారు. ప్రతి పేద వాడి ఇంటికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూర్చిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనేనన్నారు. ప్రజలందరు సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించాలన్నారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పేద ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్న తీరును సచివాలయ సిబ్బందిని, వార్డు వలంటీర్లను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, కమిషనర్ బండి శేషన్న, కౌన్సిలర్లు చింతా మారుతీ, బ్రహ్మా, శంకర తేజ, నాయకులు కాచర్ల అంజి, సిద్ది రాజేష్, ఎస్పీ బాషా, కత్తె పెద్దన్న, జరీ ప్రసాద్, శ్రీన, మునిస్వామి, ధను, అమరేందర్‌రెడ్డి, రెడ్డప్ప, శ్రీన తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ రహదారులకు మహర్దశ

**గాండ్లపెంట:** వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో గ్రామీణ రహదారులకు మహర్దశ కలిగిందని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండలంలోని సాదులవాండ్లపల్లి నుంచి తలుపుల మండలం దేవరపల్లి వరకూ రూ.90లక్షల ఉపాధి నిధులతో 2.2 కిలోమీటర్లు వేసిన తారు రోడ్డును మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా 130 గ్రామాలకుపైగా అప్రోచ్ రోడ్లను వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 40 సంవత్సరాల అనుభవం, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు అధికారంలో ఉండగా ప్రజల సొమ్మును దిగమింగి జైలు పాలయ్యారన్నారు. సీఎం జగనన్నతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో జేఈ రెడ్డివరప్రసాద్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బుక్యా రవీంద్రానాయక్, ఎంపీపీ తాతం జగన్మోహన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, సర్పంచ్ ఆంజనేయులు, జెడ్పీ మాజీ సభ్యుడు భాస్కరరెడ్డి, స్థానిక నాయకులు రాజన్న, క్రిష్టారెడ్డి చలపతి,మలేష్, అమానుల్లా, ప్రతాపరెడ్డి, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.



తారు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

### ఉద్యోగుల విజయోత్సవ ర్యాలీ

**పుట్టపర్తి టౌన్:** గతంలో ఉన్న ఏపీ నేషనల్ మజ్దూర్ యూనియన్‌కు ఏపీపీటీడీలో అతిపెద్ద అసోసియేషన్‌గా గుర్తింపు ఇచ్చిన సీఎం జగన్‌కు ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ధన్యవాదలు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఉమ్మడి అనంతపురం, సత్యసాయి జిల్లాలో కమిటీ ఆధ్వర్యంలో 13 డిపోల ఉద్యోగులు, కార్మికులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. సాయి ఆరామంలో జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసి ధన్యవాదాలు తెలిపి సమస్యలపై చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సీసీఎస్ కమిటీ సభ్యులు శ్రీనివాసరాజు హాజరయ్యారు.



పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

# తాడిమర్రి వాసుల కల సాకారం చేస్తున్నాం

• ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

**తాడిమర్రి:** తాడిమర్రి మండల ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీహైస్కూల్ వద్ద రూ.8.10 కోట్లతో నిర్మించబోయే మాల్యవంతం–పార్నపల్లి బైపాస్ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి స్వయంగా హిటాచీ నడుపుతూ రోడ్డు పనులను ప్రారంభించారు. మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వీలైనంత ఎక్కువ సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రహదారులకు మహర్దశ పడుతోందన్నారు.ఈ రహదారి నిర్మాణం పూర్తయితే తాడిమర్రి నుంచి పార్నపల్లె వరకు రోడ్డుపై ఉన్న ప్రమాదకర మలుపులు తొలగిపోయి ప్రయాణం సులభతరమౌతుందన్నారు. మండలంలో ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో దోచుకోవడం పంచుకోవడం తప్ప అభివృద్ధి మచ్చుకైనా కనిపించలేదన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ సంజీవయ్య, డీఈ పుల్లమరావు, జేఈ మహాలక్ష్మి, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ నాగరాజు, వైస్ ఎంపీపీలు లింగమ్మ, కృష్ణమనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జొల్లిరెడ్డి అశ్వర్థ, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు పొరాళ్ల విజయభాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులు, సచివాలయ మండల కన్వీనర్ అల్లె సాయినాథ్‌రెడ్డి, ఉప సర్పంచ్ తాడిమర్రి రమణారెడ్డి, నాయకులు మల్లప్పగారి మాధవరెడ్డి, తాడిమర్రి శ్రీధర్‌రెడ్డి, బండారు పెద్ద ఓబిలేషు, బాల రమణారెడ్డి, మదమంచి మల్లికార్జున నాయుడు పాల్గొన్నారు.



మాల్యవంతం–పార్నపల్లె బైపాస్ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

## సంక్షిప్త సమాచారం

**ఇరువర్గాలపై కేసు నమోదు**

**కదిరి టౌన్:** మున్సిపల్ పరిధిలోని వెలుగు కార్యాలయం ఎదుట సీపీఐ కాలనీలో మంగళవారం జరిగిన గొడవ విషయంలో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పట్టణ సీఐ డివి.నారాయణరెడ్డి తెలిపారు. సీపీఐ కాలనీలో పేదలకు ఇచ్చిన ఇంటిపట్టాల విషయంలో మునికుమార్, తిమ్మప్ప, కదిరప్పపై సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, డ్రైవర్ సోము, మధు, ఆంజనేయులు,అజయ్ దాడి చేసి గాయపరిచారని పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.వారిపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఇదే సంఘటనలో పార్థసారథి కాలనీకి చెందిన ఆదిలక్ష్మి, నరసప్పపై మునికుమార్, కదిరప్ప, తిమ్మప్ప దాడి చేసి గాయపరిచారని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

**పాముకాటుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి తీవ్ర అస్వస్థత**

**ధర్మవరం రూరల్:** తుమ్మలలో పాముకాటుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. బాధతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గొర్ల యశ్వంత్‌రెడ్డి మంగళవారం పొలంలో వేరుశనగ పంట తొలగిస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. అతడిని కుటుంబ సభ్యులు అనంతపురం తీసుకెళ్లారు.

**చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

**బత్తలపల్లి:** నిద్రలో ఇంటి అరుగుపై నుంచి పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు...నల్లబోయనపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఆదిఆంధ్ర రమణ(46) గత నెల 24న పనికి వెళ్లి వచ్చి ఇంటి ముందు అరుగు మీద నిద్రపోయాడు. రాత్రి అరుగు మీద నుంచి కిందపడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి.కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**నీటి సరఫరా బంద్**

**ధర్మవరం:** పట్టణంలోని హిందూ శ్మశానవాటిక వద్ద జోన్–3 పైపులైన్ పగిలిపోవడంతో నీటి సరఫరా బంద్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. పట్టణంలోని పీఆర్‌టీ వీధి, ఇందిరానగర్, మార్కెట్‌వీధి, దర్గావీధి, యాదవవీధి, బోయవీధి, సిద్ధయ్యగుట్ట, సాయినగర్, జోగోనికుంట, ఎర్రగుంట వార్డులకు నీటిసరఫరా నిలిపివేశామన్నారు.

**పింఛను అందజేత**

**తనకల్లు:** చీకటిమానిపల్లికి చెందిన నజురుల్లా కుమార్తె తానియా హిమోఫిలియాతో బాధపడుతోంది. మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి ఈ విషయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే వైద్యాధికారులతో మాట్లాడి చిన్నారికి డీఎంహెచ్‌ఓ పింఛన్ మంజూరయ్యేలా చర్యలు తీసుకున్నారు. మంగళవారం రూ. 10 వేలను తానియాకు ఎమ్మెల్యే అందజేశారు.

**జిల్లా పర్యటకశాఖ అధికారికి సన్మానం**

**పుట్టపర్తి అర్బన్:** ఇటీవల ప్రపంచ పర్యటక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగేశ్వరరెడ్డికి జాతీయ ఉత్తమ అధికారిగా అవార్డు దక్కింది. ఈనేపథ్యంలో మంగళవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని పర్యాటక శాఖ కార్యాలయంలో ఆయన్ను అధికారులు, సిబ్బంది సన్మానించారు.

**రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక**

**రామగిరి:** మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సర్వేశ్వరి మంగళవారం తెలిపారు. గత నెల 30న అనంతపురం జూనియర్ కళాశాలలో జరిగిన పోటీల్లో మోక్షిత్, ప్రతాప్, వంశీ, బన్నీ , అజయ్, వెన్నెల, మంజులా బాయి, సంధ్య, మోహనరూప ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.